## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

### వరుస సెలవులు.. తిరుమలలో
## భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ

తిరుపతి: వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

### ట్రంప్‌ను 'ఫుడ్ ట్రక్'తో పోల్చిన ఇరాన్..
## హార్ముజ్ జలసంధిపై మాటల యుద్ధం

ఢిల్లీ: ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న తమ హెచ్చరికలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ తీవ్రస్థాయిలో బదులిచ్చింది. ట్రంప్‌ను ఒక 'ఫుడ్ ట్రక్'తో పోలుస్తూ ఎద్దేవా చేయడమే కాకుండా, ముందు ఆయన తన సొంత భద్రత గురించి ఆలోచించుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది. ట్రంప్ విదేశాంగ విధానాలు, హెచ్చరికలు స్థిరంగా ఉండవని, రోడ్డు పక్కన ఉండే ఫుడ్ ట్రక్కులు తమ మెనూను, ప్రదేశాన్ని మార్చినట్లుగానే ఆయన తీరు కూడా ఉంటుందని ఇరాన్ దౌత్య వర్గాలు విమర్శించాయి. స్థిరమైన దౌత్యనీతి లేని నాయకుడిగా అభివర్ణించేందుకే ఈ 'ఫుడ్ ట్రక్' పదాన్ని ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అంతేకాకుండా, అమెరికాలో ట్రంప్ ఎదుర్కొంటున్న రాజకీయ, న్యాయపరమైన సవాళ్లను ప్రస్తావిస్తూ, ఇరాన్‌కు సలహాలిచ్చే ముందు తన భద్రత గురించి చూసుకోవాలని టెహ్రాన్ హితవు పలికింది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలిపే హార్ముజ్ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి అత్యంత వ్యూహాత్మకమైనది. ప్రపంచ సముద్ర చమురు రవాణాలో 20 శాతానికి పైగా, అంటే రోజుకు సుమారు 21 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. తమపై పాశ్చాత్య దేశాలు విధించే ఆంక్షలకు ప్రతిగా ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ తరచూ హెచ్చరిస్తుండగా, అక్కడ నౌకల స్వేచ్ఛా రవాణాకు ఆటంకం కలిగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా స్పష్టం చేస్తూ వస్తోంది.

## సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తాం

హైదరాబాద్: స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### జాతిపితకు ఐసీసీ నివాళి
## గాంధీ జయంతినే 2027 వరల్డ్ కప్ ఆరంభం!

ఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్వహించనున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. జాతిపిత మహాత్మా గాంధీకి నివాళిగా, ఈ మెగా టోర్నీని ఆయన జయంతి రోజైన అక్టోబర్ 2న ప్రారంభించాలని ఐసీసీ ప్రాథమికంగా నిర్ణయించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీని గాంధీ జయంతి రోజున ప్రారంభించడం ద్వారా ఆయనకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ చేసిన పోరాటం చారిత్రాత్మకం. తన జీవితంలో 21 సంవత్సరాలు (1893–1914) అక్కడే గడిపిన గాంధీజీ, సత్యాగ్రహ ఉద్యమానికి బీజం వేసింది కూడా అక్కడే. ఈ నేపథ్యంలో, దక్షిణాఫ్రికాలో గాంధీజీ సాగించిన వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని, ఆయన అహింసా సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని ఆ దేశ జాతిపిత నెల్సన్ మండేలా తదనంతర కాలంలో పోరాటం సాగించిన చారిత్రాత్మక బంధాన్ని స్మరించుకుంటూ.. ప్రపంచకప్‌ను ఆయన జయంతి రోజున ప్రారంభించడం సముచితంగా ఉంటుందని ఆతిథ్య దేశాల క్రికెట్ బోర్డులు భావిస్తున్నాయి. 2027 ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు. గత టోర్నీలో 10 జట్లు పాల్గొనగా, ఈసారి 14 జట్లతో నిర్వహించనున్నారు. ఈ జట్లను ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-3లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. 2003 ప్రపంచకప్ తరహాలో ఈ ఫార్మాట్‌ను మళ్లీ ప్రవేశపెడుతున్నారు. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు టోర్నీలో నేరుగా ప్రవేశం లభించింది. అయితే, నమీబియా మాత్రం క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధించాల్సి ఉంటుంది. మొత్తం 54 మ్యాచ్‌లను జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్, డర్బన్‌తో పాటు హరారే, విండ్‌హోక్ వంటి ప్రముఖ వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉంది. ప్రసార హక్కులు, మ్యాచ్‌ల షెడ్యూలింగ్ ఖరారైన తర్వాత ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 2న ప్రారంభమై సుమారు ఏడు వారాల పాటు ఈ టోర్నీ కొనసాగనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, క్రికెట్ వేదికగా మహాత్ముడికి ప్రపంచం అందించే గొప్ప గౌరవంగా ఇది నిలిచిపోతుంది.

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను

### కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు. పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు. తన నూతన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ తరహాలోనే తాను కూడా సరికొత్త చరిత్ర సృష్టిస్తానని ధీమాగా చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆమె వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఇప్పటికే 100 రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వివరించారు.

### నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ...
## ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్

ఢిల్లీ: భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానమంత్రుల్లో, ఎర్రకోట నుంచి అత్యధిక సమయం ప్రసంగించిన నేతగా ఆయన నిలిచారు. ప్రసంగాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రసంగ సమయం పరంగా మాజీ ప్రధానులందరి కంటే ఆయన ముందంజలో ఉండటం విశేషం. ప్రధాని మోదీ ఇప్పటివరకు 13 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ద్వారా మొత్తం 1,177 నిమిషాలు పాటు ప్రసంగించారు. ఇదే క్రమంలో, 16 ప్రసంగాల్లో ఇందిరా గాంధీ 504 నిమిషాలు, 10 ప్రసంగాల్లో మన్మోహన్ సింగ్ 417 నిమిషాలు, 17 ప్రసంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ 400 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే మోదీ తక్కువ సార్లు ప్రసంగించినప్పటికీ, వారిద్దరి మొత్తం ప్రసంగ సమయం కంటే రెట్టింపునకు పైగా మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ కార్యక్రమాలు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం సాధన వంటి అంశాలపై ప్రభుత్వ విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు వివరంగా తెలియజేయడానికే ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రసంగాలకు ప్రాధాన్యతనిచ్చారు.

### ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..
## కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

### నాయకులు రూ.2 వేలు ఇస్తే..
## రూ.2 లక్షలు సంపాదించుకుంటారు

అమరావతి: 'ఎన్నికల్లో డబ్బులు తీసుకోవడం మనం ఎందుకు మానేయలేం? ఏ రాజకీయ నాయకుడూ ఇంటిలో నుంచి డబ్బులు తీసుకురారు. వాళ్లు ఇచ్చేదంతా లంచాల సొమ్మే. ఎన్నికల్లో రూ.2 వేలు ఇస్తే, దానికి రూ.2 లక్షలు సంపాదించుకుంటారు. అంటే వాళ్లు సంపాదించుకునే దానిలో మీకు చిల్లర విదిలిస్తారు. ఓటు కోసం మీకు రూ.2 వేలు ఇచ్చాక, వీళ్లకోసం ఎందుకు పనిచేయాలి, అసలు వీళ్ల దగ్గరకు ఎందుకెళ్లాలనే చులకనభావం నేతల్లో వస్తుంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఎన్ని పనులు చేసినా, పథకాలు అమలు చేసినా.. తాత్కాలిక ప్రయోజనం వస్తే అటు వెళ్లిపోతుంటారు. ఎన్నికల్లో పది రూపాయలు ఎక్కువ ఇస్తామంటే వాళ్లకు ఓటేస్తున్నారు. దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. నేతలు డబ్బులు ఇస్తుంటే.. మాకు నీతి ఉందని చెప్పండి. డబ్బులు తీసుకోకుండా ఓటేయండి. మిగిలిన వారిలోనూ దీనిపై అవగాహన కల్పించండి. దీనివల్ల మీకు నాలుగు రెట్లు ఫలితం వస్తుంది' అని తెలిపారు.

'ప్రతిపక్ష పార్టీ వాళ్లు రోడ్డుమీదకు వచ్చారంటే.. గొడవలు చేసి, రెచ్చగొడతారు. రప్పా రప్పా అని, మాకు అధికారం వస్తే నరికేస్తామని పోస్టర్లు ప్రదర్శిస్తారు. ఆడవారిపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెడతారు. ఇలాంటి వాళ్లెవరినీ వదిలిపెట్టం. శాంతిభద్రతలు నియంత్రణలో ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. అందుకే శాంతిభద్రతలపై మహిళల్లో చైతన్యం రావాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. కుటుంబసభ్యులు వ్యసనాల బారినపడకుండా చూసుకోవాలి' అని చంద్రబాబు సూచించారు. 'అంబేద్కర్, అబ్దుల్ కలాం, ఎన్టీఆర్.. పేద కుటుంబాల నుంచి వచ్చి ఉన్నతస్థాయికి ఎదిగారు. మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము దేశ అధ్యక్షురాలు అయ్యారు. టీ విక్రయించే వాడినని చెప్పే నరేంద్ర మోదీ.. శక్తిమంతుడైన ప్రధాని అయ్యారు. సంకల్పం బలంగా ఉంటే తప్పకుండా ఏదైనా సాధించవచ్చనడానికి వీరే నిదర్శనాలు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా, స్త్రీశక్తి పథకంతో బయటి ప్రపంచాన్ని చూసేందుకు అవకాశం ఏర్పడింది. పదిమందినీ చూశాక మనం అలా ఎందుకు ఎదగలేం అనే ప్రశ్న ఉదయిస్తుంది. అది అభివృద్ధికి దారి తీస్తుంది. కొందరు రోజుకు మూణ్నాలుగు గంటలు రీల్స్ చూసుకుంటూ కూర్చుంటారు. అందులో 2 గంటలు అదే సెల్‌ఫోన్‌లో ఏదైనా విజ్ఞానం పెంచుకుంటే మరింత అభివృద్ధి చెందవచ్చు. ప్రతి ఒక్కరూ 'అను నేను' సంకల్పంతో తమ కుటుంబం, గ్రామం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాననే బాధ్యత తీసుకోవాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

### ప్రతి కుటుంబానికి మూణ్నాలుగు పథకాలు

'రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి కనీసం మూణ్నాలుగు పథకాలు అందిస్తున్నాం. 2047 నాటికి ఆర్థిక అసమానతలు తొలగించి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. చేపలుపట్టి ఇస్తుంటే.. వాటిని ఇవ్వని రోజు పస్తు ఉండాలి. దానికి బదులు చేపలు పట్టడం నేర్పిస్తే, వారికి మరింత ఆదాయం వస్తుంది. నేను అదే చేస్తున్నా. ప్రభుత్వ బడుల్లో విద్య మెరుగవుతోంది' అని తెలిపారు.

### 99.5% రుణం చెల్లించేది మీరే

'డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు ఎక్కువ మంది ఎగతాళి చేశారు. కానీ ఆ ఉద్యమంతో లక్షల కుటుంబాలు బాగుపడ్డాయి. మహిళలకు గుర్తింపు వచ్చింది. కొందరైతే భర్త కంటే ఎక్కువ సంపాదించి, కుటుంబాన్ని పోషిస్తున్నారు. రూ.25 వేల కోట్ల పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉంది. కొన్ని పెద్ద పరిశ్రమలు కూడా రుణాలు కట్టకుండా ఎగ్గొడతాయి. కానీ 99.5 శాతం రుణాలను చెల్లించే ఏకైక వ్యవస్థ డ్వాక్రా సంఘాలు. ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త, ఒక జిల్లా- ఒక ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాం. మీ ఉత్పత్తులను దేశ, విదేశాలకు విక్రయించే స్థాయికి ఎదగాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

## 2025 నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తుది ఓటర్ల జాబితాలతో కాకుండా, 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా నిర్వహించనున్నారు. అక్టోబరు 3న 'సర్' తుది ఓటర్ల జాబితాలు ప్రచురించనున్నారు. వాటిని ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాలు ప్రచురిస్తే ఎన్నికల నిర్వహణలో జాప్యమవుతుందని భావిస్తున్నారు. ఈ కారణంతో 2025 నాటి జాబితాలకే రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఈ మేరకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటర్ల జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థలకు అక్టోబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ప్రభుత్వం ఉందన్న సమాచారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ శుక్రవారమే నివేదిక ఇచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటే ఎన్నికలు సమీపించినట్లుగానే భావించాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితాల ప్రచురణ.. మున్సిపాలిటీల్లో వచ్చే నెల 3లోగా, ఇప్పటివరకు జాబితా సిద్ధంచేయని సుమారు యాభై పంచాయతీల్లో ఈ నెల 17లోగా పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటికి సంబంధించిన పబ్లికేషన్ ప్రక్రియ కూడా ఈ నెల 21 నుంచి 31లోగా పూర్తి చేయాలని సూచించింది. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ఇతర రాష్ట్రాలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇప్పటికే లేఖలు రాశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇతరత్రా ఏర్పాట్లు 30-45 రోజుల్లో పూర్తి చేయాలన్న యోచనతో ఎన్నికల సంఘం ఉంది.

## హస్త కళాకారులకు అందుబాటులో వుడ్ బ్యాంకులు

రాజమహేంద్రవరం: హస్తకళల పరిరక్షణ, ఆయా రంగాలపై ఆధారపడ్డ కళాకారులకు ముడి సరకు కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా.. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం వద్ద అటవీశాఖ ఏర్పాటుచేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. సతీమణి అన్నా కొణిదెలతో కలిసి ఆయన ఇక్కడకు వచ్చారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, మాధవమాల, శెట్టిగుంట కళాకృతులు, బొబ్బిలి వీణల కళాకారులకు కలప అందుబాటులో ఉంచేలా రాష్ట్రంలోని మరో ఆరు క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన వుడ్ బ్యాంకులను సైతం వర్చువల్‌గా ప్రారంభించారు. వీటి ద్వారా సుమారు 5వేల మంది హస్త కళాకారుల కుటుంబాలకు ముడిసరకు సమస్య తీరనుంది. సెంట్రల్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలప ఉందని, వచ్చే ఐదేళ్ల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అంతకుముందు వుడ్ బ్యాంక్ ప్రాంగణంలో రెండు రుద్రాక్ష మొక్కలను పవన్ కల్యాణ్ నాటారు. కలప దుంగలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎక్కడినుంచి సేకరించారు? ఆ వృక్షం వయసు, శాస్త్రీయ నామం తదితర వివరాలు తెలుసుకున్నారు. సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు ప్రాంగణంలో వివిధ ప్రాంతాల కళాకారులు ఏర్పాటుచేసిన హస్త కళాకృతులను పవన్ కల్యాణ్ దంపతులు ఆసక్తిగా తిలకించారు. కళాకారులతో మాట్లాడి వాటి ప్రత్యేకతలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెళ్లి జంట బొమ్మ, వారాహి మాత బొమ్మలను కావాలని అన్నా కొణిదెల అడగడంతో.. పవన్‌కల్యాణ్ వాటిని కొనుగోలు చేసి ఆమెకు ఇచ్చారు. కొండపల్లి కళాకారుడు అగ్గిపెట్టెలో తయారుచేసిన ఆకృతిని చూసి పవన్ దంపతులు ముచ్చటపడ్డారు.

### హైదరాబాద్-అమరావతి: పక్కపక్కనే హైస్పీడ్ రైల్..
## 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే!

హైదరాబాద్-అమరావతి: హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, బందరు పోర్టులను అనుసంధానించేలా రెండు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సమాంతరంగా పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే లైన్, ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను పక్కపక్కనే నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా అంగీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, హైదరాబాద్-విజయవాడ ప్రస్తుత జాతీయ రహదారికి ఎడమవైపు ఎక్స్‌ప్రెస్‌వే, కుడివైపు హైస్పీడ్ రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు.

760 కిలోమీటర్ల హైస్పీడ్ రైలు మార్గం

హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైల్వే కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు. ఇందులో తెలంగాణ పరిధిలో 180 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగనుంది. ఈ మార్గంలో శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, నాగార్జునసాగర్ (హాలియా), వాడపల్లి వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2.24 లక్షల కోట్లు కాగా, దాదాపు 790 హెక్టార్ల భూమి అవసరమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే ఈ మార్గంలో మార్కింగ్ పనులు పూర్తయ్యాయి.

298 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే

హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజనల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్యలో ఉన్న ముచ్చర్ల ఫ్యూచర్ సిటీ సమీపంలోని తిప్పారెడ్డిపల్లి వద్ద ఈ 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం కానుంది. ఇది అమరావతి మీదుగా మచిలీపట్నం-బందరు పోర్టుకు అనుసంధానమవుతుంది. మొత్తం 297.82 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో తెలంగాణ పరిధిలో 118 కిలోమీటర్లు (40 గ్రామాల మీదుగా), ఏపీలో మిగిలిన భాగం (60 గ్రామాల మీదుగా) విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులకు వేర్వేరుగా కాకుండా ఒకేసారి భూసేకరణ చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం వల్ల భూసేకరణ భారం తగ్గడమే కాకుండా, హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి, బందరు పోర్టుకు ప్రయాణ, సరుకు రవాణా సమయం గణనీయంగా ఆదా కానుంది.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి మంత్రి నారా లోకేశ్ ఘన నివాళి

అమరావతి: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ తన పోస్టులో వాజ్‌పేయి సేవలను కొనియాడారు. "భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘననివాళులు అర్పిస్తున్నాను. దేశం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణపరంగా అభివృద్ధి చెందడంలో వాజ్ పేయి కీలకపాత్ర పోషించారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. భారతరత్న వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా దేశానికి వారు అందించిన సేవలను స్మరించుకుందాం" అని లోకేశ్ పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో సౌమ్యుడిగా, గొప్ప వక్తగా పేరుగాంచిన వాజ్‌పేయి, దేశ ప్రగతికి వేసిన బాటలను ఈ తరం గుర్తుంచుకోవాలని ఆయన తన సందేశం ద్వారా పిలుపునిచ్చారు.

### ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో
## స్నేహమంటున్న ట్రంప్.. కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చి ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### బెంగాల్ రాజకీయాల్లో కలకలం.. పార్టీ ఆఫీస్‌లో
## ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన మాజీ డిప్యూటీ స్పీకర్

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా? లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధ్రువ సాహో చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల
## దరఖాస్తుల గడువు ముగింపు



హైదరాబాద్: హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు. మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు అమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.

# టీవీ యాడ్స్‌పై 12 నిమిషాల పరిమితి ఎత్తివేత.. కేంద్రం కీలక నిర్ణయం

**టీవీ ఛానెళ్ల ప్రకటనలపై 12 నిమిషాల పరిమితిని ఎత్తివేసిన కేంద్రం**

**పోటీని ప్రోత్సహించి వ్యాపార సౌలభ్యం పెంచడమే లక్ష్యమని వెల్లడి**

**2006లో తెచ్చిన ఈ నిబంధన ప్రస్తుత పరిస్థితులకు సరిపోదని స్పష్టీకరణ**

**డిజిటల్ మీడియాతో సమాన పోటీ కల్పించేందుకే ఈ నిర్ణయమని మంత్రిత్వ శాఖ వివరణ**

**గెజెట్ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి**



టెలివిజన్ ఛానెళ్ల ప్రసారాల్లో ప్రకటనల సమయంపై ఉన్న కీలక నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. గంటకు 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చేయాలన్న పరిమితిని ఎత్తివేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. టీవీ, డిజిటల్ మీడియా మధ్య సమాన పోటీని ప్రోత్సహించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 1994 నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనల కింద 2006లో ఈ 12 నిమిషాల ప్రకటనల పరిమితిని ప్రవేశపెట్టారు. అయితే, అప్పటి నుంచి ఇప్పటివరకు టీవీ ప్రసార రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని మంత్రిత్వ శాఖ వివరించింది. 2006లో దేశంలో కేవలం 62 టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 900కు పైగా ఉందని గుర్తు చేసింది. ఆ రోజుల్లో అనలాగ్ పద్ధతిలో ఉన్న కేబుల్ టీవీ ప్రసారాల వల్ల ఛానెళ్ల సంఖ్య పరిమితంగా ఉండేది. కానీ, ఇప్పుడు కేబుల్ టీవీ రంగం పూర్తిగా డిజిటలైజ్ అయింది. డీటీహెచ్, కేబుల్ టీవీ, ఐపీటీవీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 300 నుంచి 500కు పైగా ఛానెళ్లను అందిస్తూ ప్రేక్షకులకు విస్తృత ఎంపికలు కల్పిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో పోటీతత్వం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లో టీవీ రంగం 'పే' లేదా 'ఫ్రీ-టు-ఎయిర్' ఛానెల్ అనే దానితో సంబంధం లేకుండా ప్రకటనల ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మరోవైపు, డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ప్రకటనలపై ఎలాంటి కాలపరిమితి నిబంధన లేదు. ఈ అసమాన పోటీ వాతావరణాన్ని సరిదిద్దేందుకే టీవీ ఛానెళ్లకు కూడా ఈ పరిమితిని తొలగించాలని నిర్ణయించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనలు-1994కు అవసరమైన సవరణలు చేసి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

## చిన్న గదిని పెద్దదిగా మార్చే టెక్నిక్..
# ఫర్నిచర్ ఇలా ఎంచుకుంటే చాలు!



- చిన్న గదులు విశాలంగా కనిపించాలంటే ఫర్నిచర్ ఎంపిక కీలకం
- నేలకు ఆనకుండా, కాళ్లున్న సోఫాలు, కుర్చీలు ఎంచుకోవాలి
- గ్లాస్ లేదా అద్దాల టేబుల్స్ వాడితే గది మరింత ఓపెన్‌గా కనిపిస్తుంది
- ఫర్నిచర్ ముందు కాళ్ల కిందకు వచ్చేలా పెద్ద రగ్గులు వాడాలి
- పైకప్పు ఎత్తుగా అనిపించేందుకు పొడవాటి కర్టెన్లు, ల్యాంప్స్ ఉపయోగించాలి

నగరాల్లో ఇరుకైన ఇళ్లలో నివసించే వారికి లివింగ్ రూం చిన్నగా ఉందనే భావన సర్వసాధారణం. అయితే, కొన్ని తెలివైన ఫర్నిచర్ ఎంపికలతో ఆ చిన్న గదినే విశాలంగా, స్టైలిష్‌గా మార్చుకోవచ్చని ఇంటీరియర్ డిజైనర్లు చెబుతున్నారు. ఫర్నిచర్ కొనేటప్పుడు ఒకే ఒక్క సింపుల్ టెక్నిక్ పాటిస్తే చాలు. నేరుగా నేలపై ఆనుకుని ఉండే సోఫాలు, కుర్చీలకు బదులుగా... కనీసం 4-5 అంగుళాల ఎత్తైన కాళ్లు ఉన్న ఫర్నిచర్‌ను ఎంచుకోవడమే ఆ రహస్యం. ఫర్నిచర్ కింద, చుట్టూ నేల కనిపించడం వల్ల గదిలో ఎక్కువ ఫ్లోర్ స్పేస్ ఉన్న భ్రమ కలుగుతుందని నిపుణులు వివరిస్తున్నారు. ఇది గదిని తేలికగా, ఓపెన్‌గా మార్చేస్తుంది. అదే సోఫాకు అంచులు (స్కర్ట్స్) ఉండటం, నేలను పూర్తిగా కప్పేసే ఫర్నిచర్ వాడటం వల్ల గది మరింత ఇరుకుగా, బరువుగా కనిపిస్తుంది. కాళ్లున్న ఫర్నిచర్‌తో పాటు గ్లాస్ లేదా అద్దాల సైడ్ టేబుల్స్ వాడితే గది మరింత ఓపెన్‌గా, ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. ఫర్నిచర్ ఎంపికతో పాటు దాని అమరిక కూడా చాలా ముఖ్యం. గదిని మొత్తం ఆక్రమించే భారీ సెక్షనల్ సోఫాకు బదులుగా, కాళ్లున్న ఎల్-ఆకారపు సోఫాను ఎంచుకోవడం మేలు. గదిని కుర్చీలతో నింపేయకుండా, అవసరమైన కొన్ని మల్టీ-ఫంక్షనల్ వస్తువులతో సర్దుకోవడం మంచిది. వీటితో పాటు మరికొన్ని చిట్కాలు కూడా గదిని విశాలంగా చూపడానికి సహాయపడతాయి. గదిలో పరిచే కార్పెట్ (తివాచీ) చిన్నగా కాకుండా, సోఫా, కుర్చీల ముందు కాళ్ల కిందకు సరిపోయేంత పెద్దదిగా ఉండాలి. ముదురు రంగులకు బదులుగా లేత రంగులు, గదిలోకి వెలుతురును ప్రతిబింబించే అద్దాలు, తేలికపాటి కర్టెన్లు వాడాలి. గది ఎత్తుగా కనిపించడానికి ఫ్లోర్ నుంచి సీలింగ్ వరకు ఉండే కర్టెన్లు, పొడవాటి ల్యాంప్స్, నిలువుగా ఉండే వాల్ ఆర్ట్ వంటివి ఉపయోగపడతాయి. ఈ చిన్న చిన్న మార్పుల ద్వారా గది అసలు సైజును మార్చకుండానే... దానిని ఎంతో విశాలంగా, ఆకర్షణీయంగా మార్చుకోవచ్చు.

# మీ ఇంటి బాల్కనీలోనే పండ్ల తోట.. ఇలా చేయండి!

- కుండీల్లో సులభంగా పెంచగలిగే పండ్ల మొక్కలు
- తక్కువ శ్రమ, నీటితోనే మంచి దిగుబడి
- జామ, దానిమ్మ వంటివి బాల్కనీలకు అనువైనవి
- కొన్ని నెలల్లోనే ఫలాలనిచ్చే స్ట్రాబెర్రీ మొక్కలు
- ఇంటిపట్టునే తాజా పండ్లు పొందే అవకాశం



ఇంట్లో పండించిన తాజా పండ్లను తినాలని చాలామందికి ఉంటుంది. కానీ, నగరాల్లో స్థలం లేకపోవడం, సమయం కేటాయించలేకపోవడం వంటి కారణాలతో చాలామంది ఆసక్తి ఉన్నా వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారి కోసం, తక్కువ శ్రమతో, చిన్న కుండీల్లోనే పెంచుకోగలిగే కొన్ని పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటి సంరక్షణకు ఎక్కువ సమయం కేటాయించకపోయినా, అప్పుడప్పుడు నీళ్లు పోయడం మర్చిపోయినా ఇవి తట్టుకుని నిలబడతాయి. ఈ మేరకు టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక కథనాన్ని ప్రచురించింది. బాల్కనీలు లేదా పరిమిత స్థలంలో పెంచుకునేందుకు అనువైన ఆ 5 మొక్కలేంటో ఇప్పుడు చూద్దాం.



జామ : ఈ జాబితాలో మొదటిది జామ మొక్క. ఇది ఎలాంటి నేలలోనైనా సులభంగా పెరుగుతుంది. అప్పుడప్పుడు నీళ్లు పోయడం మర్చిపోయినా తట్టుకుంటుంది. చీడపీడల బెడద కూడా తక్కువే. కనీసం ఒక అడుగు వ్యాసం ఉన్న కుండీలో నాటితే, ఒకటి లేదా రెండేళ్లలోనే ఫలాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది.

స్ట్రాబెర్రీ : వీలైనంత త్వరగా ఫలితాలు కావాలనుకునే వారికి స్ట్రాబెర్రీ ఉత్తమ ఎంపిక. నాటిన కొన్ని నెలల్లోనే తియ్యని పండ్లను అందిస్తుంది. దీనికి ఎక్కువ స్థలం కూడా అవసరం లేదు. వేలాడే కుండీలు లేదా చిన్నపాటి టబ్బుల్లో కూడా వీటిని సులువుగా పెంచుకోవచ్చు.

అంజీర్ : అంజీర్ మొక్కకు కూడా పెద్దగా శ్రద్ధ అవసరం లేదు. ఎండ తగిలే బాల్కనీలో పెడితే చాలు. దీనికి స్వీయ పరాగ సంపర్కం జరుగుతుంది కాబట్టి, ఫలాల కోసం మరో మొక్క అవసరం లేదు. కాకపోతే, క్రమం తప్పకుండా కొమ్మలను కత్తిరించడం అవసరం.

దానిమ్మ : దానిమ్మ మొక్క వేర్లు లోతుగా వెళ్లవు. అందుకే కుండీల్లో పెంచడానికి ఇది చక్కగా సరిపోతుంది. ఇది కూడా స్వీయ పరాగ సంపర్కం చేసుకుంటుంది. పండ్లు రాకముందు పూచే అందమైన నారింజ రంగు పూలు బాల్కనీకి ప్రత్యేక ఆకర్షణ ఇస్తాయి.

మల్బరీ : మల్బరీ మొక్క చాలా వేగంగా పెరుగుతుంది. ఎలాంటి వాతావరణంలోనైనా తట్టుకుని నిలబడుతుంది. కుండీల్లో పెంచేటప్పుడు కొమ్మలను తరచూ కత్తిరిస్తూ ఉంటే, మొక్క అదుపులో ఉంటుంది. ఒకసారి పెరగడం మొదలైతే, మంచి దిగుబడిని ఇస్తుంది.

అయితే, ఈ మొక్కల పెరుగుదల, కాపు అనేవి వాతావరణం, కుండీ సైజు, తీసుకునే సంరక్షణపై ఆధారపడి ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. మీ ప్రాంతానికి ఏ రకం మొక్కలు సరిపోతాయో తెలుసుకోవాలంటే స్థానిక నర్సరీ లేదా ఉద్యానవన నిపుణులను సంప్రదించడం ఉత్తమం. కాస్త ఆసక్తి ఉంటే చాలు... మీ ఇంటి బాల్కనీలోనే తాజా పండ్లను ఆస్వాదించవచ్చు.

# ఇరాన్‌కు 2 టన్నుల బంగారం..
## యూఏఈ సంచలన నిర్ణయం వెనుక కారణమేంటి?

**పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ యూఏఈ సంచలన నిర్ణయం**

**ఇరాన్‌కు 2 టన్నుల బంగారం, బిలియన్ల కొద్దీ నిధులు విడుదల చేసినట్లు కథనాలు**

**దాడుల నుంచి రక్షణ పొందేందుకే ఈ నిర్ణయమన్న విశ్లేషణలు**

**అబుదాబి నుంచి టెహ్రాన్‌కు ప్రత్యేక విమానాలు వెళ్లినట్లు నిర్ధారణ**

**ఆరోపణలను గతంలోనే ఖండించిన యూఏఈ ప్రభుత్వం**



పశ్చిమాసియాలో ఇరాన్.. అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. భవిష్యత్తులో జరగబోయే దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకునేందుకు, తమ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను యూఏఈ విడుదల చేసిందని ఈ కథనాల సారాంశం. వివరాల ప్రకారం, యూఏఈ సుమారు 2 టన్నుల బంగారం, బిలియన్ల డాలర్ల విలువైన నిధులను ప్రత్యేక విమానాల్లో ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఆగస్టు 11, 12 తేదీల్లో అబుదాబి నుంచి కొన్ని రాయల్ జెట్ విమానాలు ఇరాన్‌లోని మెహ్రాబాద్, పయామ్ విమానాశ్రయాలకు చేరుకొని, కొద్దిసేపటికే తిరిగి వెళ్లాయని ఏవియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఈ విమానాల్లోనే బంగారం, నగదు తరలించి ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ బంగారం విలువ సుమారు 283 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని సమాచారం. పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే, తమ భూభాగంపై ఇరాన్ ఎలాంటి దాడులకు పాల్పడకుండా స్పష్టమైన హామీ పొందేందుకే యూఏఈ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తీవ్రమైన ఆర్థిక ఆంక్షలతో సతమతమవుతున్న ఇరాన్‌కు ఈ నిధుల విడుదల పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. అయితే, ఈ వార్తలపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. తమ దేశంలోని ఇరాన్ ఆస్తులను విడుదల చేస్తున్నట్లు వస్తున్న వార్తలను యూఏఈ విదేశాంగ శాఖ గతంలోనే ఖండించింది. విమానాలు ప్రయాణించిన మాట వాస్తవమే అయినా, వాటిలో బంగారం, నగదు తరలించారనడానికి కచ్చితమైన ఆధారాలు ఇంకా బయటకు రాలేదు. ఏది ఏమైనప్పటికీ, ఈ 'రెండు టన్నుల బంగారం' వ్యవహారం ప్రస్తుతం పశ్చిమాసియా దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..
## సూర్యుడి అతిపెద్ద రహస్యంపై కీలక ఆధారాలు!

**సూర్యుడి కరోనా వేడి రహస్యంపై కీలక ఆధారాలు సేకరించిన ఆదిత్య ఎల్1**

**భారత్ తొలి సోలార్ మిషన్ పరిశోధనలో వెల్లడైన కొత్త విషయాలు**

**ఉపరితలం కన్నా వాతావరణం కొన్ని మిలియన్ డిగ్రీలు వేడిగా ఉండటానికి కారణాలపై అధ్యయనం**

**సౌర తుఫాన్ల తర్వాత శక్తి ఎలా భర్తీ అవుతుందో వివరించిన భారత శాస్త్రవేత్తలు**

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి**

భారత అంతరిక్ష పరిశోధనలో ప్రతిష్ఠాత్మకమైన ఆదిత్య-ఎల్1 సౌర యాత్ర అద్భుతమైన ఫలితాలను అందిస్తోంది. సూర్యుడికి సంబంధించి దశాబ్దాలుగా అంతుచిక్కని ఓ అతిపెద్ద రహస్యాన్ని ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సూర్యుడి ఉపరితలం కన్నా దాని బాహ్య వాతావరణం (కరోనా) మిలియన్ల డిగ్రీల మేర అత్యంత వేడిగా ఎందుకు ఉంటుందనే మిస్టరీపై ఈ పరిశోధన కొత్త విషయాలను తెరపైకి తెచ్చింది. భారత్ మొట్టమొదటిసారిగా సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 నుంచి అందిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ వివరాలను వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన ప్రొఫెసర్ ఆర్. రమేశ్ నేతృత్వంలోని బృందం చేసిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. శాస్త్రవేత్తలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రశ్న.. సూర్యుడి ఉష్ణోగ్రత తీరు. సూర్యుడి కేంద్రంలో దాదాపు 1.5 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ, మన కంటికి కనిపించే ఉపరితలం (ఫొటోస్ఫియర్) వద్ద కేవలం 5,500 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఆశ్చర్యకరంగా, ఉపరితలానికి ఎంతో దూరంలో ఉండే బాహ్య వాతావరణమైన కరోనాలో ఉష్ణోగ్రత సుమారు 20 లక్షల డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఏకంగా 4 కోట్ల డిగ్రీలకు కూడా చేరుకుంటుంది. వేడి పుట్టే కేంద్రం నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గాల్సింది పోయి, ఇలా విపరీతంగా పెరగడం భౌతిక శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా అనిపించడంతో ఇది సౌర శాస్త్రంలో ఓ పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది. సూర్యుడి నుంచి వెలువడే సౌర జ్వాలలు (సోలార్ ఫ్లేర్స్), కరోనల్ మాస్ ఎజెక్షన్స్ (సీఎంఈ) వంటి తీవ్రమైన సౌర తుపానులకు కరోనానే పుట్టినిల్లు. ఈ ప్రక్రియలో సూర్యుడు భారీ పరిమాణంలో శక్తిని, ఆవేశపూరిత కణాలను అంతరిక్షంలోకి విడుదల చేస్తాడు. దీనివల్ల భూమిపై అరోరాల వంటి అందమైన దృశ్యాలు ఏర్పడినప్పటికీ.. పవర్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నావిగేషన్ వ్యవస్థలు, శాటిలైట్లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రొఫెసర్ రమేశ్ ప్రకారం, సూర్యుడు సాధారణంగా తక్కువ చురుకుగా ఉన్నప్పుడు రోజుకు రెండు నుంచి మూడు సీఎంఈలను విడుదల చేస్తాడు. అదే 11 ఏళ్ల సౌర చక్రంలో గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు రోజుకు పదికి పైగా తుపానులను సృష్టిస్తాడు.



ఈ క్రమంలో నిరంతరం శక్తిని కోల్పోతున్నప్పటికీ, కరోనా తన అత్యధిక ఉష్ణోగ్రతను ఎలా నిలబెట్టుకోగలుగుతుందనేది శాస్త్రవేత్తలకు అంతుబట్టలేదు. ఒకవేళ ఆ కోల్పోయిన శక్తి తిరిగి భర్తీ కాకపోతే, సూర్యుడు క్రమంగా చల్లబడిపోయి, సౌర వ్యవస్థ మొత్తం ప్రభావితమయ్యేది. ఆదిత్య-ఎల్1 అందించిన డేటా, ఈ శక్తిని కరోనా ఎలా తిరిగి పొందుతుందో వివరిస్తోంది. సౌర తుపానుల ద్వారా శక్తిని కోల్పోయినప్పటికీ, కొన్ని ప్రత్యేక ప్రక్రియల ద్వారా కరోనా తన ఉష్ణోగ్రతను పునరుద్ధరించుకుంటుందని భారత శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. ఈ ఆవిష్కరణ సౌర భౌతిక శాస్త్రంలో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, భూమిపై సాంకేతిక వ్యవస్థలను ప్రభావితం చేసే సౌర తుపానులను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి దోహదపడుతుంది.



# జాతికి స్ఫూర్తి.. సర్దార్ డా. గౌతు లచ్చన్న..!

## జమ్మలమడుగులో ఇంటింటికి టీడీపీ

### 1, 2వ వార్డుల్లో ప్రజలను కలిసిన భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు మహి న్యూస్ ఆగస్టు 16 జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని ప్రజలను కలిశారు. వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మహి న్యూస్ ఆగస్టు 16 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## నేడు (17వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

కడప, మహి న్యూస్ ఆగస్టు 16: జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## 28 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

### ఎంఈఓ పిల్లి నాగరాజు.

గాలివీడు:ఆగష్టు16(మహి న్యూస్): మండలంలో ఖాళీగా ఉన్న 28 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టుల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి పిల్లి నాగరాజు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో అర్హులైన అభ్యర్థులను అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ లుగా మెరిట్ ప్రాతిపదికన నియమించడం జరుగుతుందన్నారు.మండలంలో ఖాళీల వివరాలను వెల్లడిస్తూ ఎస్జీటీ (తెలుగు)- 21, ఎస్జీటీ(ఉర్దూ)-4 , స్కూల్ అసిస్టెంట్ -(3) బయాలజీ, హిందీ,ఫిజిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ఎంపికైన వారికి ఎస్జీటీ రూ.10000, స్కూల్ అసిస్టెంట్ రూ.12500 గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు.విద్యార్హతలు కలిగిన వారు ఆగస్టు 21 వ తేదీ లోపు స్థానిక విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## అటల్ బిహారీ వాజపేయికి ఘన నివాళులు




గాలివీడు:ఆగష్టు16(మహి న్యూస్): భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా గాలివీడులో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశ రాజకీయాల్లో అటల్ బిహారీ వాజపేయి ప్రత్యేక ముద్ర వేశారని, ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారని నాయకులు కొనియాడారు. ఆయన ఆదర్శాలు, దేశభక్తి, స్ఫూర్తిదాయకమైన రాజకీయ ప్రస్థానం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ బీజేవైఎం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రేవనూరు రాజకుమార్, మాజీ జిల్లా అధికార ప్రతినిధి యర్రనాగు భాస్కర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు యు. ప్రసాద్, అంగడి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో కుక్కల స్వైర విహారం

### ప్రయాణికులకు తప్పని తిప్పలు. - పట్టించుకోని అధికారులు?



గాలివీడు: ఆగష్టు16(మహి న్యూస్): మండలకేంద్రం బస్టాండ్ ఆవరణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.పదుల సంఖ్యలో కుక్కలు బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతుండటంతో ప్రయాణికులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులు కుక్కల గుంపులను చూసి భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే సమయంలో కుక్కలు గుంపులుగా చుట్టు ముడుతుండటంతో ఎప్పుడు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.కుక్కల బెడదపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### జిల్లా రెవిన్యూ అధికారి కె. మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ ఆగస్టు 16: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుడు.. సర్దార్ డా. గౌతు లచ్చన్న జాతికి స్ఫూర్తిదాయకం అని డిఆర్వో కె. మల్లికార్జునుడు కొనియాడారు. ఆదివారం కడప కలెక్టర్ లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, డిఆర్వో కె. మల్లికార్జునుడు అధ్యక్షతన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ... సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ డా. గౌతు లచ్చన్న చేసిన కృషి రాష్ట్రానికే కాకుండా యావత్ భారతావనికే స్ఫూర్తిదాయకం అని చెప్పవచ్చన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన త్యాగం, పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయ నాయకుడు అయిన సర్దార్ డా. గౌతు లచ్చన్న 1909 సంవత్సరంలో ఆగష్టు 16న శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో చిట్టయ్య, రాజమ్మ దంపతులకు ఎనిమిదో సంతానంగా జన్మించారన్నారు. ఆయన తన చిన్న వయస్సులోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి మహాత్మా గాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం





మరియు ఇతర ప్రధాన పోరాటాలలో పాల్గొన్నారన్నారు. బెర్హంపూర్ మరియు రాజమండ్రి జైళ్లలో కఠిన కారాగారవాసంతో సహా అనేక శిక్షలను ఆయన అనుభవించారన్నారు. దూరదృష్టి, దృఢమైన గాంధేయవాది అయిన గౌతు లచ్చన్న అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నడిపారన్నారు. హరిజన సేవాసంఘాన్ని స్థాపించి, హరిజనుల కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించి, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చురుకుగా పనిచేశారన్నారు. రైతు రక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి... 1940లో పలాసలో చారిత్రాత్మక అఖిల భారత కిసాన్ సభను నిర్వహించారన్నారు. మందస తిరుగుబాటు సమయంలో అతను రైతులు, గిరిజన సంఘాలకు అండగా నిలిచి.. రైతుల హక్కులను కాపాడటానికి అజ్ఞాతంలోకి వెళ్లి తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయులన్నారు. స్వాతంత్ర్యానంతరం కార్మిక, వెనుకబడిన తరగతుల కోసం బలమైన వాణిని వినిపించి.. ఎమ్మెల్యే, ఎంపీగా కూడా పనిచేశారన్నారు. అంతేకాకుండా.. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (×దీుఖజ) ఆంధ్రా యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా పనిచేసి.. గణనీయమైన కార్మిక ఆందోళనలకు నాయకత్వం వహించారన్నారు. 1948లో మొట్టమొదటి ఆంధ్రా వెనుకబడిన తరగతుల సదస్సుకు అధ్యక్షత వహించారున్నారు. 1957లో ఓబీసీ జాబితాను హైకోర్టు కొట్టివేసినప్పుడు, దాని పునరుద్ధరణ కోసం అతను రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భారీ ఆందోళనకు నాయకత్వం వహించారున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నాయకత్వంలో దీనిని పునరుద్ధరించారన్నారు. ఆయన సరళత, దేశభక్తి మరియు సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం, జీవితకాల నిబద్ధత వంటి గుణాలను.. మన సమాజం వారసత్వంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 98 సంవత్సరాల వయసులో 2006 ఏప్రిల్ 19న విశాఖపట్నంలో ఆయన తుది శ్వాస విడిచారన్నారు. ఆయన వెనుకబడిన, అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి చేసిన కృషికి.. యావత్ ఆంధ్ర రాష్ట్రం కృతజ్ఞతా భావం చూపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని ప్రభుత్వ పండుగగా ప్రకటించడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందుగా.. డిఆర్వో, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించగా.. పలువురు వక్తలు లచ్చన్న జీవితంలో జరిగిన విశేషాలను తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి కృష్ణ, స్టెప్ సీఈవో ప్రసాద్, బీసీ జాతీయ మహాసభ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, జిల్లా గౌడ సంఘం గౌరవాధ్యక్షులు రామమూర్తి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, పూలే విగ్రహ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు టీవీ రమణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం నగర కమిటీ అధ్యక్షులు హరికుమార్, వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్ర, ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం అధ్యక్షులు హోస్లేష్ యాదవ్, పీడీయూ జిల్లా




విద్యార్థి విభాగం అధ్యక్షులు అంకన్న, పర్యాటక అభివృద్ధి కమిటీ సలహా సభ్యులు వెంకటేశ్వర ఆచారి, హెచ్డబ్ల్యూఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జయప్రసాదరాజు, పలువురు సంక్షేమ శాఖల అధికారులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆగష్టు 17న సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం).....

మదనపల్లి, మహి న్యూస్, ఆగస్టు 16: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఆగస్టు 17న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగించాలి

### కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి.






మదనపల్లె, మహి న్యూస్, ఆగస్టు 16: అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా గౌతు లచ్చన్న చిరస్మరణీయులన్నారు. విద్య, సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. లచ్చన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి పి. తేజస్విని, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, మదనపల్లె తాలూకా గౌడ సంఘం అధ్యక్షులు కె. కృష్ణయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శులు తుమ్మల దేవేంద్ర గౌడ్, జగిలేటి మురలీధర్ గౌడ్, లక్ష్మీపతి గౌడ్, గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష



ప్రకాశం / టంగుటూరు, మహి న్యూస్, ఆగస్టు 16 : ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కాకుటూరు వారిపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ని మంత్రి ప్రారంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. పేదల విద్య వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైసీపీ హయాంలో పేద ప్రజల ఆరోగ్యానికి గాలికొదిలి వైద్య శాఖను నిర్లక్ష్యం చేశారన్నారు. నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం మందులు కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పి 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..వైసీపీ ఓర్వలేక రాష్ట్రంలో శవ, కుల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వైసీపీ ఓ విషవృక్షం ప్రజలు దాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## కొమరవోలులో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాలు



కొమరవోలు, మహి న్యూస్, ఆగస్టు 16: విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దత్తత దేవాలయమైన కృష్ణా జిల్లా, పామర్రు మండలం కొమరవోలు గ్రామములోని శ్రీ అమరలింగేశ్వర దుర్గా నాగేశ్వర స్వామి వారి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా ముగిశాయి. మాన్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి దత్తత గ్రామమైన కొమరవోలులో, గౌరవ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డోనార్ స్కీమ్ కింద గ్రామస్థులు మరియు ప్రముఖ దాతలైన కాట్రగడ్డ రమేష్ దంపతులు తమ సొంత నిధులతో ఈ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

### శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా మహోత్సవాలు ు శాంతి కళ్యాణం:

ఈ నెల 14.08.2026న ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ముగింపు దశకు చేరుకున్నాయి.

శుభ ముహూర్తాన ప్రతిష్ఠ: 16.08.2026 ఆదివారం ఉదయం 7 గంటల 29 నిమిషాలకు నిర్ణీత శుభ ముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

?శిఖర కుంభాభిషేకం: అనంతరం ఆలయ శిఖర కుంభాభిషేకం, పూర్ణాలతో శిఖర అభిషేకం, మరియు మహా పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు.

శాంతి కళ్యాణం ు ఆశీర్వచనం: ప్రతిష్ఠానంతరం స్వామివారి శాంతి కళ్యాణం కన్నులపండువగా జరిగింది. విచ్చేసిన భక్తులకు అర్చక పండితులు వేద ఆశీర్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### వేలాది భక్తులకు అన్నదానం:

ఈ మహోత్సవాల సందర్భంగా గ్రామం మరియు పరిసర ప్రాంతాల నుండి తరలివచ్చిన సుమారు 4,000 నుండి 5,000 మంది భక్తులకు దాతల సౌజన్యంతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దాతలకు దుర్గగుడి తరఫున ఘన సత్కారం:

ఈ పవిత్ర మహోత్సవంలో పాల్గొన్న ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) వీకే శీనా నాయక్ ఆలయ నిర్మాణ దాతలైన కాట్రగడ్డ రమేష్ దంపతులను దుర్గగుడి తరఫున శాలువా, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మరియు ఈవో మాట్లాడుతూ.. కాట్రగడ్డ రమేష్ దంపతులు సనాతన హిందూ ధర్మ పరిరక్షణ పట్ల ఎంతో నిబద్ధతతో, భక్తి శ్రద్ధలతో సొంత గ్రామంలో ఆలయాన్ని నిర్మించి ఈ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ మహత్కార్యం ద్వారా వారు పరిసర ప్రాంతాల్లోని సమస్త గ్రామ ప్రజల మన్ననలు పొందారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైదిక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, దేవస్థాన అధికారులు మరియు వేలాది మంది గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## పల్లిపాలెంలో ఘనంగా ముగిసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ శత వార్షికోత్సవ వేడుకలు



కాజులూరు మండలం, మహి న్యూస్, ఆగస్టు 16: కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయ శత వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. పిఠాపురం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఇంద్రగంటి నారాయణ సోమయాజులు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన శత జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగాయి. మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ అర్చకులు పెద్దింటి రంగాచార్యులు, ఇంద్రగంటి గోపి బ్రహ్మత్వంలో స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి రామచెల్లారెడ్డి దంపతులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శత



వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శత వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com